నమస్తే తెలంగాణ
# నిపుణ
Guide to Excellence
08.
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
nipuna
Every Wednesday Free Supplement
6 నవంబర్ 2024
పేజీలు 8


**బయో మ్యానుఫ్యాక్చరింగ్ ఇన్‌స్టిట్యూట్**

దేశంలో తొలి బయో మ్యానుఫ్యాక్చరింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను పంజాబ్‌లోని మొహాలిలో ప్రారంభించారు. వ్యవసాయ-ఆహార రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చేందుకు ఉద్దేశించింది ఇది. నేషనల్ అగ్రి-ఫుడ్ బయోటెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్, సెంటర్ ఫర్ ఇన్నోవేటివ్ అండ్ అప్లైడ్ బయో ప్రాసెసింగ్‌లను విలీనం చేయడం ద్వారా ఈ కొత్త వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారు.

## జాతీయం

**దీపోత్సవం రికార్డ్**

- దీపావళి సందర్భంగా అయోధ్యలో నిర్వహించిన దీపోత్సవం రెండు గిన్నిస్ రికార్డులను నమోదు చేసింది. ఒకే సమయంలో గరిష్ఠ సంఖ్యలో హారతిలో పాల్గొనడం ఒక రికార్డ్ అయితే అత్యధిక సంఖ్యలో దీపాలను



వెలిగించడం మరో రికార్డ్. 1121 వేదాచార్యులు ఈ వేడుకల్లో పాల్గొనగా, 25 లక్షలకు పైగా దీపాలను వెలిగించారు.

**భారత్‌లో స్పెయిన్ పీఎం**

- స్పెయిన్ ప్రధాన మంత్రి పెడ్రో సాంచెజ్ అక్టోబర్ చివరి వారంలో భారత్‌లో పర్యటించారు. సీ-295 ఎయిర్‌క్రాఫ్ట్‌లను తయారుచేసే యూనిట్‌ను ప్రధాని మోదీతో కలిసి ఆయన ప్రారంభించారు. అలాగే ఇరు దేశాల మధ్య పలు ఒప్పందాలు కుదిరాయి. సుస్థిర శక్తి కోసం పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించి, అలాగే ఇంటర్నేషనల్ డ్రాట్ రెసిలెన్స్ అలయన్స్‌లో చేరాలని భారత్‌ను స్పెయిన్ ఆహ్వానించింది. అలాగే స్పెయిన్‌లో భారత్ తన తొలి కాన్సులేట్‌ను బార్సిలోనాలో ప్రారంభించనుంది.

**రాష్ట్రపతి భవన్‌లో కోణార్క్ చక్రం**



- కోణార్క్ దేవాలయాన్ని పోలిన చక్రాన్ని ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేశారు. భారత సంస్కృతి, సంప్రదాయాలను ప్రోత్సహించేందుకు అమృత్ ఉద్యాన్‌లో దీన్ని ఏర్పాటు చేసినట్లు రాష్ట్రపతి భవన్ వర్గాలు వెల్లడించాయి.

**జనన మరణాల నమోదుకు యాప్**

- పౌర నమోదు వ్యవస్థకు సంబంధించి కొత్త యాప్‌ను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ప్రారంభించింది. సుపరిపాలనకు సాంకేతికతను జోడించడంలో ఇది భాగం. జనన, మరణాలను ఇందులో తేలికగా నమోదు చేసుకునేందుకు వీలుంటుంది. రిజిస్ట్రార్ జనరల్, సెన్సస్ కమిషనర్ దీన్ని అభివృద్ధి చేశాయి. దేశంలోని ఏ రాష్ట్రం నుంచి అయినా ఆ రాష్ట్ర అధికార భాష ద్వారానే ఈ యాప్‌లో నమోదు చేసుకోవచ్చు.

**మియావాకి**

- ప్రపంచంలోనే అత్యంత ఎత్తులో మియావాకి అడవిని ఉత్తరాఖండ్‌లోని పితోర్‌ఘ ర్‌లో ఏర్పాటు చేశారు. 8000 అడుగుల ఎత్తులో ఇది ఉంటుంది.

**మహమ్మారి నిధి**

- జంతువుల ఆరోగ్య సంరక్షణకు 25 మిలియన్ల ప్రాజెక్టును భారత్ చేపట్టింది. ఇందుకు ఆసియా అభివృద్ధి బ్యాంక్, ప్రపంచ బ్యాంక్, ప్రపంచ ఆహార-వ్యవసాయ సంస్థలతో భారత్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.

**క్యూఆర్ కోడ్ నాణేలు**

- దేశంలో తొలిసారి క్యూఆర్ కోడ్ ఆధారిత నాణేలను అందించే మెషీన్లను కేరళలోని కోజికోడ్‌లో ఏర్పాటు చేశారు. కేరళలోని ఫెడరల్ బ్యాంక్ దీన్ని అందుబాటులోకి





తెచ్చింది. రూ. 1, 2, 5, 10 నాణేలు కావాల్సిన వాళ్లు దీని సేవలను వినియోగించుకోవచ్చు.

**హెలి అంబులెన్స్**

- దేశంలో తొలి హెలి అంబులెన్స్‌ను ఉత్తరాఖండ్‌లో అందుబాటులోకి తెచ్చారు. దీనికి సంజీవని అని పేరు పెట్టారు. ప్రధాని మోదీ దీన్ని ప్రారంభించారు. రుషికేశ్ ఎయిమ్స్ దీన్ని నిర్వహిస్తుంది. అదేవిధంగా దేశంలోనే తొలిసారి రచయితల గ్రామం అయిన 'తనో' ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ఉంది. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి దార్శనికతను అమలు చేయడంలో భాగంగా ఈ గ్రామాన్ని తీర్చిదిద్దారు. గ్రామంలో గ్రంథాలయం, యోగా కేంద్రం తదితరాలు ఉంటాయి. రచయితలకు ప్రత్యేక గదులు, సదుపాయాలను అందుబాటులోకి తెచ్చారు.

**తల్లిపాలు ప్రాథమిక హక్కు**

- బిడ్డకు పాలివ్వడం తల్లికి ఉన్న ప్రాథమిక హక్కు అని, అలాగే ఆ బిడ్డకు కూడా ఇది ఒక ప్రాథమిక హక్కే అని కేరళ హైకోర్ట్ తీర్పు చెప్పింది. రాజ్యాంగంలోని 21వ అధికరణలో భాగంగా దీన్ని ప్రాథమిక హక్కుగానే పరిగణించాలని సూచించింది.

**భద్రతా మండలి**



- 'మారుతున్న పరిస్థితుల్లో శాంతి స్థాపనలో మహిళలు' అనే అంశంపై భద్రతా మండలిలో చర్చ జరుగుతున్న సందర్భంలో పాకిస్థాన్ కశ్మీర్ అంశాన్ని లేవనెత్తింది. దీని పట్ల భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. అసందర్భంగా, అది కూడా పూర్తి తప్పు సమాచారాన్ని పాకిస్థాన్ అంతర్జాతీయ వేదికలపైన మాట్లాడటం తగదని హితవు పలికింది.

**ప్రపంచ వాతావరణ సంస్థ**

- ప్రపంచ వ్యాప్తంగా కార్బన్ డై ఆక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్‌ల గాఢత పారిశ్రామికీకరణ ముందు ఉన్న స్థాయికంటే భారీగా పెరిగిందని జెనీవా కేంద్రంగా పనిచేసే ప్రపంచ వాతావరణ సంస్థ తాజా నివేదికలో పేర్కొంది. ఇవి వరుసగా 151%, 265%, 125% పెరిగినట్లు వెల్లడించింది. పరిశ్రమల వల్ల కార్బన్ డై ఆక్సైడ్, వ్యవసాయం, చిత్తడి నేలల మూలంగా మీథేన్, మానవుడి చర్యలతో నైట్రస్ ఆక్సైడ్‌లు పెరుగుతున్నాయని తెలియజేసింది.

**సౌదీ అరేబియా**



- ప్రపంచంలోనే అతిపెద్ద భవనాన్ని రియాద్‌లో నిర్మించనున్నారు. 1300 అడుగుల ఎత్తుతో పాటు 1200 అడుగుల వెడల్పుతో ఈ భవనం నిర్మాణం కానుంది. ఫ్లోర్ వైశాల్యం 2 మిలియన్ల చదరపు అడుగులు ఉంటుంది. కార్యాలయాలతో పాటు గృహాలు కూడా ఇందులో ఉండనున్నాయి.

**జీ-20**

- మూడు లక్ష్యాల ప్రాతిపదికన బహుళ దేశాల బ్యాంకులు పని చేయాలని ఒక నిపుణుల కమిటీ సూచించింది. జీ-20 ఈ కమిటీని ఏర్పాటు చేసింది. ఇందులో భారత్‌కు చెందిన ఎన్‌కే సింగ్‌తో పాటు అమెరికాకు చెందిన లారెన్స్ కూడా సభ్యులుగా

## అంతర్జాతీయం

ఉన్నారు. తీవ్ర పేదరిక నిర్మూలన, సమ్మిళిత వృద్ధి పెంపు, సుస్థిరాభివృద్ధి అనే మూడు అంశాలకు బహుళ దేశాల బ్యాంకులు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఈ కమిటీ సూచించింది.

**బ్రెజిల్**

- చైనా ప్రారంభించిన బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ నుంచి బ్రెజిల్ నిష్క్రమించింది. ఈ ప్రాజెక్టును 2013లో చైనా చేపట్టింది. భారత్ ఇందులో చేరలేదు. ఆసియా ఖండం నుంచి ఫిలిప్పీన్స్ కూడా గతంలోనే ఇందులో నుంచి నిష్క్రమించింది. జీ-7 కూటమిలోని ఇటలీ కూడా బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ నుంచి గతంలోనే వైదొలగింది.

**యూకే**



- తమ దేశంలోని బొగ్గు ఆధారిత ప్లాంట్లను అన్నింటిని మూసివేయాలని యూకే నిర్ణయించింది. కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. 140 సంవత్సరాలుగా ఆ దేశంలో బొగ్గు ఆధారిత ఉత్పత్తి ఉంది. ఇటీవల బొగ్గు ఆధారిత విద్యుత్ ప్లాంట్ రాట్‌క్లిఫ్‌ను కూడా మూసివేసింది. అలాగే ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ పరిధిలోని సోమర్‌విల్లే కళాశాలలో నిర్మించనున్న భవనానికి రతన్ టాటా పేరు పెట్టాలని యూకే నిర్ణయించింది. వ్యాపార సామ్రాజ్య విస్తరణ, సమాజ సేవ చేయడంలో ఆయన చూపిన ప్రతిభకు గుర్తుగా ఈ నిర్ణయం తీసుకున్నది.

**సూడాన్**

- సూడాన్‌లో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న అంతర్గత సంఘర్షణ మూలంగా ఇప్పటికే 14 మిలియన్ల మంది వలస వెళ్లారని జెనీవా కేంద్రంగా పనిచేసే ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ సంస్థ తన తాజా నివేదికలో వెల్లడించింది. సూడాన్ సైన్యం, సూడాన్ పారా మిలిటరీ బలగాల మధ్య ఏప్రిల్ 2023 నుంచి సంఘర్షణ మొదలయ్యింది.

**ఉచిత క్యాన్సర్ చికిత్స**



- 14 సంవత్సరాల్లోపు చిన్నారులందరికీ ఉచితంగా క్యాన్సర్ చికిత్సను నేపాల్ ప్రభుత్వం ప్రారంభించనుంది. 2024 నవంబర్ 16 నుంచి ఇది ప్రారంభం కానుంది. ఆ దేశంలో మూడు ఆస్పత్రుల్లో ఈ చికిత్సను చేపట్టనున్నారు.

**డిజిటల్ మౌలిక సదుపాయాలు**

- దేశంలో డిజిటల్ సదుపాయాలను పెంపొందించేందుకు యూఎస్, జపాన్, దక్షిణకొరియా ఒక అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. 5జీ/6జీ, సబ్‌మెరైన్ కేబుల్స్, ఆప్టికల్ ఫైబర్, డేటా సెంటర్ల ఏర్పాటు, ఈ-కామర్స్, కృత్రిమమేధ, క్వాంటం సాంకేతికత తదితరాల్లో భారత్‌కు ఆ మూడు దేశాలు ఉమ్మడిగా సాయం చేయనున్నాయి.

## వార్తల్లో వ్యక్తులు

**విపిన్ కుమార్**

- ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు కొత్త చైర్మన్‌గా విపిన్ కుమార్ నియమితులయ్యారు.

**కనకరాజు**



- గిరిజనుల సంప్రదాయ గుస్సాడి నృత్యకారుడు, పద్మశ్రీ అవార్డ్ గ్రహీత కనకరాజు మరణించారు. ఆసిఫాబాద్ జైనూర్ మండలం మర్లవాయికి చెందిన వారు ఆయన.

**దీపక్ అగర్వాల్**

- నేషనల్ అగ్రికల్చరల్ కో ఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్‌కు మేనేజింగ్ డైరెక్టర్‌గా దీపక్ అగర్వాల్ నియమితులయ్యారు.

**బిభబ్ తాలూక్‌దార్**



- అసోంకు చెందిన పర్యావరణ వేత్త బిభబ్ కుమార్ తాలూక్‌దార్ ప్రతిష్ఠాత్మక 'హరి మెస్సెల్' అవార్డుకు ఎంపికయ్యారు. ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయూసీఎన్) సంస్థ ఈ అవార్డును ఇస్తుంది.

**రవిశంకర్:** ఫిజీ దేశం ఇచ్చే గౌరవ అవార్డ్ ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు రవిశంకర్‌కు ప్రకటించారు. ఈ అవార్డును 'హానరరీ ఆఫీసర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఫిజీ' అని పిలుస్తారు.

## తెలంగాణ

**ఏఎన్ఆర్ పురస్కారం**



- నటుడు చిరంజీవికి ఏఎన్ఆర్ పురస్కారం దక్కింది. 2024 సంవత్సరానికి ఆయన ఈ అవార్డును అందుకున్నారు. 2006లో ఏర్పాటు చేసిన ఈ అవార్డ్ తొలి గ్రహీత దేవానంద్.

**ఓటర్ల ముసాయిదా**

- తెలంగాణలోని అన్ని జిల్లాల్లో ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేశారు. దీని ప్రకారం మొత్తం 3,34,10,375 మంది ఓటర్లు రాష్ట్రంలో ఉన్నారు. 1,66,01,108 మంది పురుషులు కాగా 1,68,06,490 మంది మహిళలు ఉన్నారు. 2777 మంది ఇతరులు

**ఆనంద్ రావుకు రాష్ట్రపతి ప్రశంస**

- ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో 13 రోజులుగా కొనసాగుతున్న సంప్రదాయ చిత్రకళా ప్రదర్శనలో కుమ్రం భీం జిల్లా వాసి ఆనంద్ రావు ప్రతిభ చూపారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆనంద్ రావుకు అవార్డును అందజేశారు. జైనూర్ మండలంలోని మారుమూల గిరిజన గ్రామం రాసిమెట్టుకు చెందిన మడావి ఆనంద్ రావు ఆదివాసీల ఆరాధ్య దైవం అయిన ఏత్మసూర్ దండారీ ఉత్సవాల చరిత్రను తెలుపుతూ గీసిన చిత్రానికి గాను రాష్ట్రపతి ప్రశంసించారు.

**ఎస్పీఎఫ్‌కు సచివాలయ భద్రత**



- తెలంగాణ సచివాలయ భద్రత తిరిగి తెలంగాణ ప్రత్యేక రక్షణ బలగానికి దక్కింది. ప్రస్తుతం ఈ బాధ్యతను నిర్వర్తిస్తున్న తెలంగాణ స్పెషల్ పోలీస్ నుంచి భద్రతా వ్యవహారాలను టీజీఎస్పీఎఫ్‌కు అప్పగించారు. కమాండెంట్ దేవీదాస్ సచివాలయ ప్రధాన భద్రతా అధికారిగా నియమితులయ్యారు. 212 మంది సిబ్బందిని నియమించారు.

**అశ్విని నాగిరెడ్డి**

- హైదరాబాద్‌లోని కేంద్ర విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీకి చెందిన ప్రొఫెసర్ అశ్విని నాగిరెడ్డికి అరుదైన గుర్తింపు లభించింది. స్కాలర్ జీపీఎస్ టాప్ స్కాలర్లలో ఒకరిగా ఆయన గుర్తింపు పొందారు. 23,947 అనులేఖనాలు, 362 ప్రచురణలతో మొత్తం హెచ్-ఇండెక్స్ 85లో ఆయన ఉన్నారు. ప్రొఫెసర్ అశ్విని చూపిన ప్రతిభకు ఈ గుర్తింపు దక్కింది.

**రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయాలు**

- ప్రతి శాసనసభ నియోజకవర్గంలో 3500 ఇళ్లను నిర్మించాలని రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయించింది. అలాగే
- మెట్రో రైలు రెండో దశ విస్తరణ
- ధాన్యం సేకరణకు 6 వేలకు పైగా కేంద్రాలు
- ములుగులో గిరిజన విశ్వవిద్యాలయానికి 211 ఎకరాల కేటాయింపు
- స్కిల్స్ యూనివర్సిటీకి అనుబంధంగా మధిర, వికారాబాద్, హుజూర్‌నగర్‌లో ఐటీఐల మంజూరు.


వి. రాజేంద్ర శర్మ
ఫ్యాకల్టీ
9849212411


